# మగ పురుగులు

పి. నాని

ఆదివారం అపురూపమయిందన్న కించకు క్షణం కూడా వృధా పోనీయకూడదనే దుస్సంకల్పంతో గురునాథం పదయినా లేవ లేదు.

గురునాథం గుర్రెడుతుంటే కామాక్షికి గుర్రుగా వుంది.

ఎంత స్వేచ్ఛగా, హాయిగా, నిశ్చింతగా నిద్ర పోగలుగుతున్నారు....కామాక్షి ఒకటికి పదిసార్లు తలపోసింది. "మగమారాజులు - మగజన్మ" అని కూడా అనుకుంది. అలా అనుకుంటూనే తన ఆడ జన్మని తిట్టిపోసింది.

"ఆదివారంగదా పెందరాళే లేవవలసిన అవసరం వుండదు గదా, పిల్లల్ని స్కూలుకు పంపాల్సిన హడావిడి వుండదుగదా, మధ్య మధ్యలో మొగుడిగార్కి పళ్ళపొడి అందించి తువ్వాలందించీ, దువ్వెన అందించీ, ఆయన గారి చిరాకు పరాకుల్ని భరించీ....ఇలా ఇలా ఖంగారు పడక్కరలేదుగదా" అని అనుకోడానికి వీలులేని ఈ పరిస్థితిని "కసి"తీరా తిట్టిపోసింది.

చంటాడు రాత్రల్లా ఏడుస్తూ ఏడిపించేసాడు. వాడిని జోకొట్టి పడుకోబెట్టంగానే అయ్యగారి అసలు కోరిక....ఒక్క రోజన్నా తనని ప్రశాంతంగా పడుకోనీయమంటే ఎక్కడలేని ప్రేమనీ ఒలకపోసి నిద్ర పోనీరుగదా-ఇలా కళ్ళు మూస్తే అలా పాలవాడి కేక.

మళ్ళా నిద్రపడుతూంటుందో లేదో పని మనిషి కేక....ఇంతలో—

చంటాడు!

ఇంతేనా జీవితం?

ఇంతేనా జీవనం?

సారమేది సంసారంలో........

ఇదేవిటి—?!?!

"ప్రేమసుధాపూరం నవజీవనసారం— సంసారం...."

హుం....ఎవరా అన్నది?

సంసారాన్ని తీసికెళ్ళి సముద్రంలో కలిపేసి తనూ ,కలిసిపోదామనుకున్నంత కోపం నిలువెత్తు లేచింది కామాక్షికి.

ఆ కోపంతోనే వెళ్ళి రేడియో గొంతు నొక్కేసి చంటాడి వీపుమీద చెళ్ళుమనిపించింది.

అప్పుడే వాడికి నీళ్ళోసి తల దువ్వి లాగూ చొక్కా తొడిగిందో లేదో లాగులో ఖరాబు చేసుకున్నాడు. వాడ్ని బరబరా నీళ్ళతొట్టి దగ్గరకి లాక్కెళ్ళి శుభ్రం చేస్తుంటే ముందు సిగరెట్టు పొగ, ఆ వెనక ఆ పొగ వదిలిన సత్యం లోపల కడుగు పెడుతూ "గురునాథం ఇంట్లో వున్నాడా వదినగారూ" అంటూ అడిగేడు.

విసుగు విసురు కలబోసి "ఆం-మంచం మహారాజులా మంచమెక్కి మంచం దిగడం లేదు-లోపల కెళ్ళండి" అంది కామాక్షి.

సత్యం వచ్చాడంటే ఓ పట్టాన పోడు. పోయేటప్పుడు వట్టి చేతులతో పోడు, తమకని చేసుకున్న పచ్చడీ, కూరా ఖాళీ పాలపేకెట్లలో వేయించుకుని "మీ వంటలు బహు రుచిగా వుంటాయి వదినగారూ" అంటూ పట్టుకుని పోతాడు.

పెళ్ళీ పెటాకుల్లేని ఈ బమ్మిగాడు ఈయన గారి కింత నేస్తుడెలాగయినాడమ్మా అని



కామాక్షి ఎప్పుడూ విస్తుపోతూంటుంది. వారానికోసారొచ్చే ఆదివారాన్ని ఇలాంటి సత్తిగాళ్ళొచ్చి ఎగరేసుకుపోతారుగదా అని సత్యాన్ని చూస్తూనే నీరుగారిపోయింది కామాక్షి.